క్లుప్తంగా

మండెం లక్ష్మీనరసింహస్వామికి శ్రావణమాస పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ మండెం లక్ష్మీ నరసింహస్వామి

చిన్నమండెం : మండల పరిధిలోని జల్లావాండ్ల పల్లె గ్రామం మాండవ్యనది ఒడ్డున వెలసిన శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో స్వామి వారి మూలవిరాట్‌మూర్తులను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం పలు పూజాది క్రతువులను స్వామి వారికి నిర్వహించారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లి : మండల పరిధిలోని గుట్టపల్లి గ్రామం పంచాయతీలో అంకిరెడ్డిగారిపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ సీతారామ, గణేష్ విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరం రెడ్డి, సతీమణి నిర్మదేవిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలను తిరుపతి వేదపండితుల పర్యవేక్షణలో వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా అంజన్నకు పుష్పయాగం



పుష్పాలను పురవీధులో ఊరేగిస్తున్న భక్తులు

రాజంపేట టౌన్: పట్టణంలో దేవదాయశాఖ పరిధిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ భక్తబృందం ప్రతినిధి వర్దిబోయిన శ్రీధర్ ఆధ్వర్యంలో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకొని ఘనంగా పుష్పయాగం కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా స్వామివారికి పుష్పయాగం కార్యక్రమానికి ప్రత్యేకంగా తెప్పించిన పుష్పాలను, ఆంజనేయ స్వామి ప్రతిమను భక్తులు పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలోని ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు పుష్పాలను సమర్పించారు. పుష్పయాగం కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకులు హరినాథ్‌శర్మ ఆధ్వర్యంలో పురోహితులు వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



శ్రీ ఆంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్న దాతలు, భక్తులు

వీరబల్లె (రాయచోటిటౌన్) : వీరబల్లె మండల పరిధిలోని మట్లి గ్రామంలో శ్రీ మహాభారత క్షేత్రంలో శ్రీ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్టను చేపట్టారు. శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో అదే గ్రామం తొగటపల్లెకు చెందిన రెడ్డెమ్మ, చిన్న నాగులు దాతృత్వంతో ఈ విగ్రహ ప్రతిష్టను నిర్వహించారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్టలో భాగంగా విశేషమైన పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకుడు నాగభూషణం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రూప్ 1,2 పోస్టులను భర్తీచేయాలి

రాయచోటి అర్బన్ : ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్–1 లో 500, గ్రూప్–2లో ఖాళీగా ఉన్న 2500 పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయకార్యదర్శి ఎం.అంకన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని డైట్ పాఠశాలలో పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రూప్ –1లో 89, గ్రూప్‌లో 508 పోస్టుల భర్తీకి మాత్రమే ఆర్థికశాఖ ఆమోదం తెల్పడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే గ్రూపు–1, 2లలో ఖాళీగా ఉన్న 3వేల పోస్టులను భర్తీచేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ అన్నమయ్య జిల్లా నాయకులు స్వరూప్‌తేజ, అనిల్, రాయచోటి నాయకులు అర్షద్, ఇర్షాద్, ప్రణయ్, కలీం, హుస్సేన్, షాబీర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 2015లో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సీఐడీ పోలీసులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అరెస్టు చేయడంపై సాధారణ ప్రజలు స్పందించారు. నేరానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా.. ఏదో ఒక రోజు శిక్ష అనుభవించక తప్పదని, అదే పరిస్థితి ప్రస్తుతం చంద్రబాబుకు ఎదురైందని పేర్కొంటున్నారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలు ఇలా..

– రాజంపేట,చిట్వేలి, ఓబులవారిపల్లె, పెనగలూరు, పుల్లంపేట



చట్టం దృష్టిలో అందరూ సమానమే



చట్టంలో దృష్టిలో అందరూ సమానమే. స్కిల్‌డెవలప్‌మెంట్‌లో వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో మాజీ సీఎంను అరెస్టు చేశారు. న్యాయస్థానంలో తాను నిజాయితీపరుడని నిరూపించుకోవాలి. అరెస్టును కూడా రాజకీయాలకు అంటగట్టడం సరికాదు.

–కమాల్‌బాషా, మాజీ రైల్వేకార్మికనేత, నందలూరు

అరెస్టు చేయడం వల్ల ప్రజలకేం నష్టం లేదు



మాజీ సీఎం చంద్రబాబునాయుడును సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. ఇందువల్ల ప్రజలకు నష్టమేమీ లేదు. చట్టపరంగా ఆయనను అరెస్టు చేశారు. కోర్టులో ఆయన తేల్చుకోవాలి.

–సాంబశివయ్యగౌడ్, ఈడిగసంఘంనేత, నందలూరు

చట్టానికి ఎవరూ అతీతులు కారు



చట్టానికి ఎవరూ అతీతులుకారు. అవినీతికి పాల్పడి ఉంటే కచ్చితంగా ఏదోఒకరోజు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. ఇప్పుడు అదే పరిస్థితి మాజీ సీఎం చంద్రబాబునాయుడుకు వచ్చింది. ఆయన అవినీతి చేశారా లేదా అనేది న్యాయస్థానమే నిర్ణయిస్తుంది. అరెస్టుకు రాద్ధాంతం చేయాల్సిన అవసరంలేదు.

–పోలి శివరామిరెడ్డి, సంఘంసేవకుడు, రాజంపేట

అరెస్టులో రాజకీయ లబ్ధిలేదు



నేరం ఎంతటి వారు చేసినా చట్టం దృష్టిలో దోషులే. మాజీ సీఎం చంద్రబాబునాయుడు తాను ఎలాంటి నేరం చేయలేదని చెపుతున్నా.. మరోవైపు తాను అరెస్టు అవుతానని ముందుగానే ఎలా చెపుతున్నారు. మాజీ సీఎంను ఎలాంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేయలేరు. అరెస్టులో రాజకీయ లబ్ధి కనిపించడంలేదు.

–డేవిడ్ కల్యాణ్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు, హెచ్‌ఆర్‌పీఎస్‌ఐ

చంద్రబాబు అరెస్టు సబబే



మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును అరెస్టు చేయడం సబబే. అధికారంలో ఉండగా ప్రజా సొమ్ము దోపిడీ చేశారు. ఎప్పటికప్పుడు వ్యవస్థలను అడ్డుపెట్టుకొని తప్పించుకున్నారు. ప్రస్తుతం పక్కా ఆధారాలతో చంద్రబాబును అరెస్టు చేశారు. ఇందులో ఎలాంటి అపోహలకు తావులేదు.

ఎ శంకర్ రెడ్డి, నాగవరం, చిట్వేలి మండలం

ఆధారాలతోనే బాబు అరెస్టు



కోట్లాది రూపాయల కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. నేరం నిర్ధారణ జరిగితే ఎంతటివారికైనా శిక్ష తప్పదు. చట్టం, న్యాయం ఒక పక్షానికి చెందినది కాదు. అందరికి సమానమే.

– షేక్ సలీమ్, కూలి, ఓబులవారిపల్లె

చట్టం ముందు అందరూ సమానమే



చట్టం ముందు అందరూ సమానమే.. చట్టానికి ఎవరూ అతీతులు కారు.. చట్టం తనపని తాను చేసుకుంటూ పోతుందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు విషయంలో తేటతెల్లమైంది. చంద్రబాబు నిజ స్వరూపం బయటపడింది. తప్పుచేసిన వారు ఎంతటివారైనా శిక్ష అనుభవించక తప్పదు.

– ముస్తాక్, పుల్లంపేట

బాబు నిప్పు అని నిరూపించుకోవాలి



నేను నిప్పు.. నేను నిప్పు అంటున్న చంద్రబాబు నాయుడు ఈ దోపిడీతో నిప్పు అని నిరూపించుకోవాలి. పక్కా ఆధారాలు ఉంటేనే పోలీసులు అరెస్టు చేస్తారు. లేకుంటే అరెస్టు చేయరు. తప్పు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదనేందుకు ఇదే ఉదాహరణ.

– బీఎల్ నరసింహారెడ్డి, ఇండ్లూరు, పెనగలూరు మండలం

మాతమ్మ దేవాలయానికి సిమెంట్ బస్తాల వితరణ

రైల్వేకోడూరు: నియోజకవర్గంలోని పుల్లంపేట మండలం వల్లూరిపల్లి గ్రామంలో మాతమ్మ ఆలయ నిర్మాణానికి శనివారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి 60 బస్తాలు సిమెంట్‌ను వితరణగా అందజేశారు. గ్రామాలలో గుడిని అభివృద్ధి చేస్తే గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు.

సబ్సిడీ ఉలవలు మంజూరు

రామాపురం: మండలానికి 80శాతం సబ్సిడీతో 425 క్వింటాళ్ల ఉలవలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ 2023 సంవత్సరానికి వర్షాభావ పరిస్థితుల వలన పంటలు సాగు చేయని రైతులకు 80 శాతం సబ్సిడీతో సోమవారం నుంచి మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఉలవలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 10 కేజీల ఉలవలు పూర్తి ధర రూ.1,080 ఉండగా సబ్సిడీ రూ.864 పోను రూ.216 రైతులు చెల్లించి తీసుకెళ్లవచ్చన్నారు.

13, 14న మండలస్థాయి క్రీడా పోటీలు

పుల్లంపేట : పుల్లంపేట మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొత్తపేట క్రీడా ప్రాంగణంలో ఈనెల 13,14 తేదిలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ బాలశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగంలో బాలబాలికలకు ఈ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వాలీబాల్, ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, యోగ, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహిస్తామన్నారు.

సంక్షేమ పథకాలతోనే పేదల అభ్యున్నతి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలు మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే

లక్కిరెడ్డిపల్లి : సంక్షేమ పథకాలతోనే పేదలు అభ్యున్నతి సాధించగలరని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లి మండలం, కాకుళారం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, మాజీ సర్పంచ్ దేవంద్ర రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలోని పిచ్చిగుంట్ల పల్లె, మునిరెడ్డిగారిపల్లె, మిద్దెకాడ పల్లె, కొత్తరాచపల్లె, చిలకపాటి హరిజనవాడ, కుంతరాజుపల్లెలలో ప్రతి ఇంటి గడపకు శ్రీకాంత్ రెడ్డి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్యలు ఆరా తీస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్హతే ఆధారంగా జగన్ పాలనలో సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. దళితుల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గుంతరాచపల్లెలో భూములు రీసర్వే సక్రమంగా తిరిగి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరగా, ఈ విషయాన్ని రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. కొత్తరాజుపల్లె, గుంతరాజుపల్లె సమీపంలోని వేరుశనగ పంట పొలాలలో పని చేస్తున్న రైతు కూలీలతో వేరుశనగ పంటపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి సురేంద్రనాథ్ రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, ఉప సర్పంచ్‌లు మద్దిరేవుల సంజీవరెడ్డి, వేమిరెడ్డి రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపం గ్రామ సచివాలయాలు

గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపంగా జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలు నిలుస్తున్నాయ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలం, కుర్నూతల గ్రామ నూతన సచివాలయ భవనాన్ని, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దేశంలో ఎక్కడా లేని విధంగా పారదర్శకంగా, ప్రతిష్టాత్మకంగా గ్రామ స్థాయిలోనే ప్రజలకు సేవలందిస్తున్నారని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు గ్రామంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రతి 2500 జనాభాకు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు ప్రభుత్వ ధ్యేయం



కమిషనర్‌తో కలిసి పెన్షన్ పత్రాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా

రాయచోటి అర్బన్ : అర్హులందరికీ పెన్షన్‌లను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అన్నారు. శనివారం వాల్మీకివీధిలోని 22వ సచివాలయంలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన వైఎస్ఆర్ పెన్షన్ కానుకను మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతలు ఉంటే చాలు ఎలాంటి సిఫారసులు లేకుండానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూర వుతాయన్నారు. అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రభుత్వం మున్సిపల్ పరిధిలో నూతనంగా 207 పెన్షన్‌లను మంజూరు చేసిందన్నారు. మరో 280 మంది అర్హుల దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని, త్వరలో వాటిని కూడా పంపిణీ చేయనున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఆసిఫ్‌అలీ ఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అష్రఫ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ కాలుష్యంతో జీవవైవిధ్యానికి ముప్పు



మాట్లాడుతున్న బీఎంకె రెడ్డి

చిన్నమండెం : పర్యావరణం కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కిపోతోందని, దీని వలన జీవవైవిధ్యం దెబ్బతింటుందని ఏపీ స్టేట్ జీవ వైవిధ్య మండలి చైర్మన్ బీఎంకె రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పలువురు రైతులు, ప్రజలతో జీవవైవిధ్యంపై మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవవైవిధ్యం దెబ్బతింటుండటం వలన ఎన్నో జీవజాతులు అంతరించిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఎఫ్‌ఓ ఖాదర్‌వలి, డీఎఫ్‌ఓ నాగమనేశ్వరి, ఎఫ్‌ఆర్‌ఓ రఘుశంకర్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, జీవవైవిధ్య కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

గ్రామ వికాసానికి పాటుపడాలి



అంగళ్లులో కార్యదర్శుల ముగింపు సమావేశంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న డీపీఓ ధనలక్ష్మి

కురబలకోట : గ్రామ కార్యదర్శులు సమగ్ర గ్రామ వికాసానికి పాటుపడాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. ఆరు రోజులుగా అంగళ్లు గోల్డన్ వ్యాలీ కళాశాలలో జిల్లా స్థాయిలో గ్రామ కార్యదర్శులకు జరిగిన రెండో బ్యాచ్ రెసిడెన్షియల్ శిక్షణ శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పూర్తి అవగాహన ఉన్నప్పుడే పరిపాలన సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయ ద్వారా అనేక సేవలు అందుతున్నాయన్నారు. గ్రామంలో మూల స్తంభాలుగా కార్యదర్శులు పని చేయాలన్నారు. ప్రజలు గుర్తించేలా విధి నిర్వహణలో కార్యదర్శులలో కొత్తదనం కన్పించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో ముందుకు సాగాలన్నారు. అంకిత భావంతో ఆపై బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పదవీ విరమణ చెందే వరకు కూడా ప్రజలకు మేలు చేసే విధంగా పని చేయాలన్నారు. పంచాయతీ రాజ్ చట్టంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులపై అవగాహనతో ముందుకు సాగాలన్నారు. డీఎల్‌పీఓ నాగరాజు, గోల్డన్‌వ్యాలీ కళాశాల నిర్వాహకులు ఎన్‌వి రమణారెడ్డి, మాస్టర్ ట్రైనర్లు ఎస్. అబ్దుల్ సుకూర్, ఎస్. నవాజ్,బయ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 219 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్‌లో ఫిర్యాదుదారులను విచారిస్తున్న జడ్జి శ్రీనివాసకల్యాణ్



నందలూరు కోర్టులో జరిగిన జాతీయ లోక్‌అదాలత్ సభలో మాట్లాడుతున్న జడ్జి కె.లత

సిద్దవటం: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 219 కేసులు పరిష్కరించామని సిద్దవటం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసకల్యాణ్ అన్నారు. సిద్దవటం కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం పోలీసు స్టేషన్, అట్లూరు, ఒంటిమిట్ట పోలీసు స్టేషన్‌ల పరిధిలోని క్రిమినల్ కేసులు 48, సివిల్ కేసులు 13, ప్రీ లిటిగేషన్ కేసులు 6, సమ్మర్ ట్రయల్ కేసులు 151, చెక్‌బౌన్స్ కేసు 1, మొత్తం 219 కేసులను పరిష్కరించామని తెలిపారు. అంతే గాకుండా సివిల్ కేసుల్లో సెటిల్‌మెంటు మొత్తం రూ. 3,61,734 , ప్రీ లిటిగేషన్ కేసుల్లో సెటిల్‌మెంటు మొత్తం రూ. 1,24,306 , సమ్మర్ ట్రయల్ కేసుల్లో సెటిల్ మెంటు మొత్తం రూ. 29,900, క్రిమినల్ కేసుల్లో రూ. 22,900, చెక్‌బౌన్స్ కేసులో రూ. 3,50,000 మొత్తం రూ.8,88,840 వచ్చిందన్నారు. క్షణికావేశంలో జరిగే ఘర్షణలకు గ్రామ పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలే తప్ప, పోలీసు స్టేషన్‌ల వరకు వెళ్లకూడదన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ అయితే అది రాజమార్గమే అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ తాజుద్దీన్, న్యాయవాదులు బి. వెంకటరత్నం, రామదాసు, రాఘవ, సి.వి. సుబ్బారెడ్డి, శివరామ్, మండల లీగల్ సర్వీసెస్ సభ్యులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, ఫిర్యాదుదారులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో 517 కేసులకు శాశ్వత పరిష్కారం

రాజంపేట : రాజంపేట, నందలూరు కోర్టులకు సంబంధించి నందలూరు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌కు విశేష స్పందన లభించిందని నందలూరు జడ్జి లత అన్నారు. నందలూరు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 517 కేసులకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. సివిల్ కేసులో రూ. 2,88, 617, క్రిమినల్ కేసుల్లో రూ. 94,13, 200లు ఫిర్యాదుదారులకు అందజేసామన్నారు. పలు క్రిమినల్ కేసులకు సంబంధించి రూ.24,800లను ప్రభుత్వ ఖాతాకు జమచేశామన్నారు. రూ.97, 26, 617లు మొత్తాన్ని పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో రాజంపేట, నందలూరు కోర్టులకు సంబంధించిన సిబ్బంది, లోక్ అదాలత్ సభ్యులు ఫైజుల్లాఖాన్‌లోడి, ఆనందకుమార్, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ





గాయపడిన అల్లాబక్షు, షౌకత్‌అలీ

మదనపల్లె : స్థలవివాదంలో ఇరువర్గాలు ఘర్షణ పడి ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన శనివారం పట్టణంలోని అమ్మచెరువుమిట్టలో చోటుచేసుకుంది.. నీరుగట్టువారిపల్లెకు చెందిన అల్లాబక్షు(45) కురబలకోట మండలం సర్కారుతోపుకు చెందిన షౌకత్‌అలీ(35)కి స్థలం అద్దెకు ఇచ్చాడు. ఇటీవల తన స్థలం ఖాళీచేయాల్సిందిగా కోరి మూడునెలల సమయం ఇచ్చాడు. అయితే అద్దెకు ఉన్న షౌకత్‌అలీ ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి ఆ స్థలం తనదేనని, తాను ఖాళీ చేయాలంటే రూ.6లక్షల నగదు ఇవ్వాలని అల్లాబక్షును డిమాండ్ చేశాడు. దీంతో ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చేందుకు శనివారం పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఇందులో భాగంగా మరోసారి ఇద్దరి మధ్య వివాదం రేగడంతో ఘర్షణ జరిగింది. గొడవలో అల్లాబక్షు తీవ్రంగా గాయపడగా, షౌకత్‌అలీ స్వల్పంగా గాయపడ్డాడు. బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ మరోసారి ఇరువర్గాలు ఘర్షణ పడి ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా పోలీసు సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుద్దాం



పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : సంక్షేమ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరం అండగా నిలుద్దామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె.బుడుగుంటపల్లె సచివాలయ పరిధిలోని కన్నెగుంట ఎస్టీకాలని, విద్యానగర్, వికాస్‌నగర్ గ్రామాలలో శనివారం ప్రభుత్వవిప్ పర్యటించారు. ఇంటింటికి వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు రాష్ట్ర ప్రజలు అడుగడునా బ్రహ్మారథం పడుతున్నారన్నారు. ఇప్పటివరకు దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చారన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగేలా రూపొందించి, అమలు చేస్తున్న పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఇప్పటివరకూ అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శకపాలనకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, తోట శివసాయి, సర్పంచ్ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ యజ్ఞం చంద్రశేఖర్, రామక్రిష్ణయ్య, సిద్దయ్య, ప్రసాద్‌రెడ్డి, రౌఫ్, బాబు, గణేష్, సూరి, దాము, మూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వాతంత్య్ర పోరాట యోధుల చిత్రాల ప్రదర్శన

కడప వైఎస్ఆర్‌సర్కిల్ : భారతదేశ స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొని విశేష సేవలు అందించిన పోరాట యోధుల చిత్ర పటాల ప్రదర్శనను ప్రతి ఒక్కరూ తిలకించాలని పలువురు నగర ప్రముఖులు పిలుపునిచ్చారు. కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 'ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాల ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కడప నగరంలోని నూరే జహా షాది ఖానాలో ఆది, సోమవారాల్లో 350 మంది స్వతంత్ర పోరాట యోధుల చిత్రపటాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనను డిప్యూటీ సీఎం అంజాద్ బాష, కడప మేయర్ సురేష్ బాబు, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ ప్రారంభించనున్నారన్నారు.

పాఠశాలలను ప్రగతి పథంలో నడిపించాలి



అంగళ్లులో హెడ్మాస్టర్ల శిక్షణలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కురబలకోట : ఒక వ్యవస్థను కాని పార్టీని కాని సమర్థవంతంగా నడిపించేవాడే నాయకుడు. హెడ్మాస్టర్లు కూడా స్కూళ్లను ప్రగతి పథంలో నడిపించాలని ఎస్ఎస్ఏ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. నాయకత్వ లక్షణాలపై అంగళ్లు గోల్డన్‌వ్యాలీ కళాశాలలో వరుసగా జరుగుతున్న హెడ్మాస్టర్ల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల బలోపేతానికి అంకిత భావంతో పని చేయాలన్నారు. టీచర్లను, తల్లిదండ్రులను సమన్వయపరచి వారి సహకారంతో పాఠశాలను ప్రగతి పథంలో నడిపించాలన్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. వారి భావి భవిష్యత్తుకు పునాది వేయాలన్నారు. బాధ్యతగా యుతంగా పనిచేసి సత్ఫలితాలను సాధించాలన్నారు. ఎంఈఓలు ద్వారకనాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పది లీటర్ల సారా స్వాధీనం

పీలేరు రూరల్ : పది లీటర్ల సారా తోపాటు ఓ నిందితున్ని అరెస్ట్ చేసినట్లు సెబ్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య తెలిపారు. వివరాలిలావున్నాయి. మండలంలోని మొరవ వడ్డిపల్లెలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో సెబ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన టి. యర్రయ్య సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.